
సాక్షి
మహబూబ్‌నగర్
శుక్రవారం । 10 । జనవరి । 2025



హ్యాండ్‌బాల్ సంగ్రామం

పాలమూరులో శుక్రవారం జాతీయ స్థాయి హ్యాండ్ పోటీలు ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



శ్రీశైలంలో 103 టీఎంసీలు

శ్రీశైలం జలాశయంలో 859.3 అడుగుల వద్ద 103 టీఎంసీల నిల్వ ఉంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /10.5

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రంగా ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

ఇన్‌స్పైర్ విభాగంలో విజేతకు బహుమతి0 అందజేస్తున్న కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్



ముగిసిన వైజ్ఞానిక సంబురం

- ప్రయోగాలను తిలకించిన 37 వేల మంది సందర్శకులు
- జాతీయస్థాయికి ఉమ్మడి జిల్లా నుంచి ఏడు ప్రదర్శనలు ఎంపిక
- ఆలోచింపజేసేలా ఆవిష్కరణలు

పాలమూరు జిల్లాలో మొట్టమొదటిసారిగా నిర్వహించిన రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన గురువారం విజయవంతంగా ముగిసింది. జడ్చర్ల సమీపంలోని పోలేపల్లి సెజ్‌లో ఉన్న ఎస్‌వీకేఎం పాఠశాలలో మూడు రోజులుగా జరిగిన ఈ వైజ్ఞానిక పండుగ విశేషంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం సమాజంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపుతూ విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేయడంతో పాటు అబ్బుర పరిచాయి. దాదాపు 37 వేల మంది సందర్శకులు ప్రయోగాలను తిలకించారు. ఇన్‌స్పైర్ విభాగంలో 29 ఎగ్జిబిట్లు జాతీయస్థాయికి ఎంపిక కాగా.. అందులో ఏడు ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ప్రదర్శనలున్నాయి.

మరిన్ని వివరాలు 8లో ▸



ముస్తాబైన సింహగిరి లక్ష్మి నరసింహస్వామి ఆలయం



పిల్లలమర్రి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం వద్ద సప్తద్వారాల ఏర్పాట్లు

ముక్కోటికి ముస్తాబు

'ముక్కోటి ఏకాదశి' కోసం పాలమూరు ముస్తాబైంది. జిల్లావ్యాప్తంగా శుక్రవారం వైష్ణవాలయాల్లో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లాకేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార దర్శనానికి అనుమతించనున్నారు. ఈసారి సప్తద్వారాలు దాటి స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. అలాగే సహస్ర నామార్చన, పుష్పార్చనలు నిర్వహించనున్నారు. బ్రాహ్మణవాడి వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పల్లకీసేవ అనంతరం ఉత్తర ద్వార దర్శనభాగ్యం కల్పిస్తారు. శ్రీనివాస కాలనీ పంచముఖాంజనేయ స్వామి దేవాలయంలో ఉదయం, సాయంత్రం విష్ణు సహస్ర నామ పారాయణాలు చేపడతారు. సింహగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నారు.

– స్టేషన్ మహబూబ్‌నగర్

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి సీఎం కప్‌లో జిల్లాకు 28 పతకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడాపోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచినట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 12 బంగారు, 14 రజతం, 2 కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించడం సంతోషంగా ఉందని తెలిపారు. అథ్లెటిక్స్‌లో 1 బంగారు, 4 రజతం, 1 కాంస్యం, ఆర్చరీలో 1 బంగారు, 2 రజతం, బాక్సింగ్‌లో 3 బంగారు, రెజ్లింగ్‌లో 1 బంగారు, వెయిట్ లిఫ్టింగ్‌లో 1 బంగారు, జిమ్నాస్టిక్‌లో 1 బంగారు, హ్యాండ్ బాల్‌లో 1 రజతం, వాలీబాల్‌లో 2 రజతం, యోగాలో 1 రజతం, 1 కాంస్యం, నెట్‌బాల్‌లో 1 బంగారు, 1 రజతం, కరాటేలో 3 బంగారు, ఉషూలో 2 రజతం, అత్యపత్యలో 1 రజత పతకాలు సాధించారని వివరించారు.

ఐక్యూఏసీ డైరెక్టర్‌గా డా.మధుసూదన్‌రెడ్డి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు యూనివర్సిటీలోని మైక్రోబయాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా.మధుసూదన్‌రెడ్డి కొత్త ఐక్యూఏసీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పీయూ వీసీ జీఎన్.శ్రీనివాస్ ఉత్తర్వులు అందజేశారు. అలాగే పీయూ కొత్త కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పీయూను త్వరలోనే న్యాక్ పీర్ బృందం సందర్శించనున్నందున ఉత్తమ గ్రేడ్ వచ్చేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ ఏడాది అత్యంత కీలకమని, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు శుభాలు కలగాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డా.కృష్ణయ్య, ఎన్.ఎస్.ఎస్. కో–ఆర్డినేటర్ డా.ప్రవీణ, సంయుక్త సంచాలకులు డా.అంకం భాస్కర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాగా, మధుసూదన్‌రెడ్డి గతంలో పరీక్షల నియంత్రణ అధికారిగా, సంయుక్త సంచాలకులుగా, సంచాలకులుగా, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్, విభాగాధిపతిగా ఇలా ఎన్నో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

గ్రామాల్లో న్యాయసేవలు పెరగాలి



పాలమూరు: చట్టాలపై అవగాహన పెంచుకొని క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంత ప్రజలకు న్యాయసేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర అన్నారు. మనో న్యాయ్ కమిటీ సభ్యులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి పిల్లల చట్టాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులతో కలిసి న్యాయమూర్తి శిశుగృహాను సందర్శించారు.

పాలమూరుపై సందిగ్ధం

ఏదుల నుంచి డిండికి నీటి తరలింపుపై ఆందోళన



ఏదుల రిజర్వాయర్

- రోజుకి అర టీఎంసీ నీటిని తరలించేలా ప్రభుత్వ ప్రతిపాదనలు
- ఇప్పటివరకు అసంపూర్తిగానే పాలమూరు పనులు
- 8.321 కి.మీ మేర టన్నెల్ నిర్మాణపనులు పెండింగ్

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ పనుల్లో పురోగతి లేక ఎక్కడికక్కడ పెండింగ్‌లో ఉండగానే.. ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని డిండి ప్రాజెక్ట్‌కు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించడం ఉమ్మడి పాలమూరు జిల్లావాసుల్లో ఆందోళన నెలకొంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కింద చేపట్టిన ఏదుల వీరాంజనేయ రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రూ.1,788.89 కోట్ల అంచనా వ్యయంతో అలైన్‌మెంట్ పనులను సైతం ఇటీవల మంత్రివర్గం ఆమోదించింది. ప్రభుత్వం ఈ నిర్మాణ పనులను చేపడితే ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రోజుకు అర టీఎంసీ చొప్పున తరలింపు..

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు నీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.1,788.89 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులకు రూపకల్పన చేసింది. 'పాలమూరు–డిండి' ప్రాజెక్ట్‌లో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి పోతిరెడ్డిపల్లి చెక్‌డ్యాం వరకు గ్రావిటీ ద్వారా నీటిని అందించేందుకు అప్రోచ్ కెనాల్‌ను నిర్మిస్తారు. అక్కడి నుంచి ఓపెన్ కెనాల్, సొరంగం, వాగు ద్వారా నీటి తరలింపు కలిపి మొత్తం 27.9 కి.మీ. మేర ప్రధాన కాల్వ నిర్మాణ పనులను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వంగూరు మండలంలోని దుందుభీ వాగు తీరంలో పోతిరెడ్డిపల్లి చెక్‌డ్యామ్ వద్ద రబ్బర్ డ్యాం నిర్మాణం చేపడతారు. ఏదుల రిజర్వాయర్ నుంచి పోతిరెడ్డిపల్లి చెక్‌డ్యామ్ వరకు, అక్కడి నుంచి ఉల్పర బరాజ్, డిండి, సింగరాజుపల్లి, ఎర్రపల్లి–గోకారం, నల్లగొండ జిల్లాలోని ఇర్వేన్, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్లకు నీటిని తరలించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

భూసేకరణే ప్రధాన సమస్య..

డిండి ఎత్తిపోతల పథకం కింద రిజర్వాయర్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున రైతుల నుంచి భూములను సేకరించాల్సి ఉంది. ఇప్పటికే చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకంలో సింగరాజుపల్లి, గొట్టిముక్కల, కిష్టరాంపల్లి, శివన్నగూడెం గ్రామాల వద్ద రిజర్వాయర్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. వీటితో పాటు కొత్తగా ప్రతిపాదించిన 'పాలమూరు–డిండి' ప్రాజెక్ట్ పనుల కోసం ప్రధాన కాల్వ, సొరంగం, అప్రోచ్ కెనాల్ నిర్మాణం కోసం రైతుల నుంచి భూమిని సేకరించాల్సి ఉంటుంది. ఇందు కోసం వనపర్తి జిల్లాలోని ఏదుల నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాలోని వంగూరు మండలం పోతిరెడ్డిపల్లి చెక్ డ్యామ్ వరకు రైతుల నుంచి భూసేకరణ చేపడతారు. ఇప్పటికే పలుమార్లు భూములను కోల్పోయిన ఇక్కడి రైతులు మరోసారి భూములను వదులుకోవాల్సిన పరిస్థితి రానుందని ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి పాలమూరుకు తీవ్రమైన నష్టం..



పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ కింద చేపట్టిన ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్ట్‌కు నీటిని తరలిస్తే ఉమ్మడి పాలమూరు జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఇక్కడి ప్రజలకు నీరు అందకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలి. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను వెంటనే పూర్తి చేయాలి.

– రాఘవాచారి, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్

ఎన్నిసార్లు భూములు కోల్పోవాలి..



ఇప్పటికే శ్రీశైలం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ పనుల కోసం వేల సంఖ్యలో ఇక్కడి రైతులు భూములను కోల్పోయి నష్టపోయారు. మళ్లీ పాలమూరు–డిండి పేరుతో ప్రభుత్వం రోజుకు అర టీఎంసీ నీటిని తరలించేందుకు భూములు సేకరిస్తామని చెబుతోంది. మళ్లీ రైతులు తమ భూములను కోల్పోవాల్సి వస్తుంది. పాలమూరు–డిండి ప్రాజెక్ట్‌తో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోతారు.

– వెంకట్‌గౌడ్, నాగర్‌కర్నూల్

పెండింగ్‌లోనే పాలమూరు ప్రాజెక్ట్..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు ఏళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రధానమైన రిజర్వాయర్ల నిర్మాణంతో పాటు కాల్వలు, టన్నెళ్ల నిర్మాణం, పంపుహౌస్, మోటార్ల బిగింపు పూర్తిస్థాయిలో చేపట్టాల్సి ఉంది. నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు చేపట్టిన ప్రధాన కాల్వ నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ పనులు పూర్తిచేసేందుకు సంబంధిత కాంట్రాక్టు సంస్థ ఇటీవల వ్యయాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని కోరింది. దీంతో ప్రధాన కాల్వ నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు మరింత కాలం పట్టనుంది. అలాగే వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్, కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణ విస్తరణ పనులు, వీటి నుంచి పంప్‌హౌస్ వరకు బండ్ నిర్మాణ పనులు సైతం పెండింగ్‌లోనే ఉన్నాయి.



కొల్లాపూర్ మండలం కుడికిళ్ల సమీపంలో నిలిచిపోయిన పాలమూరు ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ పనులు

అన్నపూర్ణగా మారుస్తాం

- ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- తెలంగాణ ప్రజల కలల సాకారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



నాగవరం సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘారెడ్డి, తదితరులు

వనపర్తి/గోపాల్‌పేట: పాలమూరు– రంగారెడ్డితో పాటు ఇతర ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించి.. పాలమూరు జిల్లాను అన్నపూర్ణగా మారుస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం వనపర్తి జిల్లాలో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రెండు సబ్‌స్టేషన్లు ప్రారంభించడంతో పాటు.. మరో 7 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. వనపర్తి మండలంలోని కాశీంనగర్, నాగవరం, మెట్టుపల్లి, చిమనగుంటపల్లి, పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి, గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తి, శ్రీరంగాపురం మండలంలోని నాగరాల విద్యుత్ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన చేశారు. అలాగే 50 మంది రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో సోలార్ విద్యుత్ శక్తి ప్యానల్స్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వనపర్తి జిల్లాలో విద్యుత్ తీగలు లైన్, స్తంభాలు మార్చడం వంటి పనుల కోసం ఇప్పటికే రూ.45 కోట్లు మంజూరు చేశామన్నారు. అలాగే రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ చేసి ప్రతి వ్యవసాయ యోగ్యమైన భూమికి ఏడాదికి రూ.12 వేల చొప్పున రైతు భరోసా ఇచ్చేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు.

❒ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఎన్ని సమస్యలు ఉన్నా రైతాంగానికి ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పారు. ఉచిత విద్యుత్ పథకం నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు.

❒ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఆర్థిక శాఖ మంత్రి హామీతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చారన్నారు. రూ.లక్ష కోట్లతో ఉమ్మడి జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి.. రాష్ట్రంలో పాలమూరును ముందు వరుసలో నిలబెడతామన్నారు.

❒ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ రైతులకు సాగునీరు ఎంత ముఖ్యమో.. విద్యుత్ కూడా అంతే అన్నారు. ఈ నెల చివర్లో జిల్లాలో భారీ రుణమేలా, జాబ్ మేలా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు.

❒ ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ అడిగిన వెంటనే వనపర్తి జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.40 కోట్లు మంజూరు చేశారన్నారు. జిల్లాలోని 14 సంక్షేమ వసతి గృహాలు అద్దె భవనాల్లో ఉన్నాయని వాటికి సొంత భవనాలు నిర్మించుకునేందుకు రూ.92 కోట్లు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. పెబ్బేరులో ఒక సబ్ స్టేషన్, 30 పడకల వైద్య ఆరోగ్య కేంద్రం, ఖిల్లాఘనపూర్‌లో డిగ్రీ కళాశాల మంజూరు చేసేందుకు సహకరించాలని, వనపర్తి మున్సిపాలిటీని గ్రేడ్ 3 నుంచి 2కు అప్‌గ్రేడ్ చేయాలని విన్నవించారు. శాట్ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి రూ.78 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ అలీ, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్ రావుల, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, విద్యుత్ శాఖ సీఈ బాలస్వామి, డైరెక్టర్ నంద కిషోర్, ఎస్‌ఈ రాజశేఖరం, ఆర్డీఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పోలీస్ సేవలపై అభిప్రాయాలు వెల్లడించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ జానకి, పోలీసు అధికారులు

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ సేవలపై ప్రజల అభిప్రాయ సేకరణ అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎస్పీ డి.జానకి అన్నారు. డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు తెలంగాణ పోలీస్ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించిన తెలంగాణ పోలీస్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ పోస్టర్‌ను గురువారం ఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించారు. పోస్టర్‌లో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లింక్ https://qr.me-qr.com/aZMTxHDm ఓపెన్ చేసి అందులో తెలపాలని సూచించారు. ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లు, ఈ–చలాన్, పాస్‌పోర్ట్ ధ్రువీకరణ ఇతర అంశాలపై ప్రజలు అభిప్రాయాలు వెల్లడించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, గిరిబాబు, సీఐలు అప్పయ్య, ఇజాజుద్దీన్, గాంధీనాయక్, శివకుమార్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, రవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం పోరాటం ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న విమలక్క

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోరాటాలు ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. గురువారం తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో టీఎస్టీయూ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. టీఎస్టీయూ అధ్యక్షుడు విజయ్‌కుమార్, అరుణోదయ, సాహితీ సాంస్కృతిక సమైక్య అధ్యక్షురాలు విమలక్క, టీఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.సత్యనారాయణ, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి, ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకుడు ప్రవీణ్, టీయూసీఐ నాయకులు వెంకటేశ్, కులనిర్మూలన సంఘం నేత గోవింద్, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్ సమావేశంలో మాట్లాడారు. జిల్లాకేంద్రంలో సర్వే నంబర్ 523లో ఇంటిస్థలం పట్టాను ప్రభుత్వానికి సరెండర్ చేసిన వారికి వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల అక్రమాలకు పాల్పడిన నాయకులు, అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. మహబూబ్‌నగర్ అర్బన్‌లో ఉన్న ప్రభుత్వ భూములపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు ఇవ్వాలన్నారు. దివిటిపల్లి డబుల్ బెడ్‌రూమ్‌లను అధిక భాగం ధనికులకు కేటాయించారని, అవి ఫామ్‌హౌస్‌లుగా మారాయన్నారు. పట్టణంలో ఇళ్లులేని పేదలు 15 వేల మంది ఉన్నారని, వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మించిఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాన ఈనెల 20న మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని, ఇందులో ప్రజలు ఐక్యంగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం రహమాన్, పి.యాదగిరి పాల్గొన్నారు.

ఊర్కొండపేట ఆలయ అభివృద్ధికి కృషి

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, ఇందుకోసం ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆలయంలో నిర్వహించిన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భక్తుల కోరికలు తీర్చే ఇలవేల్పుగా వెలుగొందుతున్న అభయాంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరారు. అలాగే పాలక మండలి సభ్యులు అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండి భక్తుల ప్రయోజనాల కోసం కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు పాలక మండలి చైర్మన్‌గా నారెడ్డి సత్యనారాయణరెడ్డి, సభ్యులుగా వెంకటమ్మ, రజిత, బొందయ్యగౌడ్, గోపాల్‌నాయక్, వెంకటయ్య, మల్లేష్‌యాదవ్, రమేష్, విజేందర్, అంజనేయులు, బంగారయ్య, వెంకటయ్య, పత్యానాయక్, మహేష్‌స్వామి ప్రమాణ స్వీకారం చేశారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రాములు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రస్తుత సమాజంలో డిజిటల్ మోసాలు పెరిగాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ రాములు అన్నారు. జిల్లాకేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో గురువారం ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, ఫోన్‌లో వచ్చే అనవసరపు లింకులను తాకవద్దని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు స్థానిక పోలీసుల సహాయం కోసం 100కు, సైబర్ నేరాలకు గురైనప్పుడూ వెంటనే 1930కు డయల్ చేయాలన్నారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు వ్యక్తిగతంగా, సామాజిక పరంగా వచ్చే సమస్యల పరిష్కారానికి తాము అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. సమావేశంలో ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు, ఆర్.నారాయణ, భగవంతు, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జేఎస్‌రెడ్డి, లలితమ్మ, భీమమ్మ, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు జగపతిరావు, కార్యదర్శి నాగభూషణం, బాల్‌రాజు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయుడి ప్రతిభ



సదరన్ సౌత్‌ఫెస్ట్‌కు ఎంపికైన నాగరాజు ప్రదర్శన

గద్వాల టౌన్: ఈ నెల 7 నుంచి 9 వరకు జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో గద్వాల ఉపాధ్యాయుడు ప్రతిభ చాటారు. స్థానిక ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు నాగరాజు ప్రదర్శించిన 'చంద్రకళలు' ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్రస్థాయిలో 2వ స్థానంలో నిలిచింది. జనవరి 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగే దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు నాగరాజు ఎగ్జిబిట్‌ను ఎంపిక చేశారు. ఉపాధ్యాయుడు నాగరాజు ఎంపికపై డీఈఓ అబ్దుల్ ఘని, పాఠశాల హెచ్‌ఎం వెంకటనర్సయ్య, జిల్లా సైన్స్ అధికారి భాస్కర్ పాపన్న, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ అంశాలపై ప్రత్యేక స్టాల్



ట్రాఫిక్‌పై పోలీసులు ఏర్పాటుచేసిన స్టాల్

మహబూబ్‌నగర్ క్రైం: పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎం పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా పోలీస్ శాఖ నుంచి మూడు రోజులుగా ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేకస్టాల్ ప్రదర్శించారు. ట్రాఫిక్ పోలీసులు వాడే డ్రంకన్‌డ్రైవ్ బ్రీత్ ఎనలైజర్ మీషన్, ఎల్‌ఈడీ బటన్స్, రిఫ్లెక్టివ్ జాకెట్స్, కెమెరాలు, ట్యాబ్‌లు ఇతర పరికరాలపై విద్యార్థులకు అవగహన కల్పించారు. దీంతో ట్రాఫిక్ నిబంధనలలో త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై పలు రకాల కార్టూన్స్ చూపిస్తూ అవగాహన కల్పించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

- జాతీయస్థాయికి ఉమ్మడిజిల్లా నుంచి 7 ప్రదర్శనలు ఎంపిక
- జూనియర్స్ విభాగంలో చిన్నరేవల్లి విద్యార్థి..

మూడు రోజులు.. 37 వేల మంది సందర్శకులు

జడ్చర్ల, జడ్చర్ల టౌన్: రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పోలేపల్లి ఎస్‌వీకేఎంలో మూడురోజుల పాటు నిర్వహించిన ఇన్‌స్పైర్ 2023–24, ఆర్‌ఎస్‌బీవీపీ 2024–25 రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ముగిసింది. ఇన్‌స్పైర్ విభాగంలో 290, ఆర్‌ఎస్‌బీవీపీలో 517 ప్రదర్శనలు వచ్చాయి. ఇన్‌స్పైరిలో 29 ప్రదర్శనలు జాతీయస్థాయికి, ఆర్‌ఎస్‌బీవీపీలో పుదుచ్చేరిలో ఈ నెల 20న జరిగే సదరన్ ఇండియా సౌత్‌ఫెస్ట్–2025కు ఎంపికయ్యాయి. అదేవిధంగా ఉపాధ్యాయుల ప్రదర్శనలు 40 రాగా వాటిలో నాలుగు జాతీయస్థాయికి ఎంపికయ్యాయి. ఆర్‌ఎస్‌బీవీపీలో 7 అంశాల్లో ప్రదర్శనలు నిర్వహించగా రెండు అంశాల్లో జూనియర్స్ విభాగంలోనూ విజేతలను ప్రకటించారు. మొత్తంగా ఇన్‌స్పైరి, ఆర్‌ఎస్‌బీవీపీతో పాటు అదనంగా 46 అవార్డులు ప్రకటించారు. 46 అవార్డులు అందుకున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి విజేతలుగా మాత్రమే పరిగణిస్తున్నారు. వీరి ప్రదర్శనలు జాతీయస్థాయికి వెళ్లవు.

అనూహ్య స్పందన..

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు అనూహ్య స్పందన లభించినట్లు అధికారులు వెల్లడించారు. మూడు రోజుల్లో 426 పాఠశాలల నుంచి మొత్తం 37 వేల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు తిలకించినట్లు అధికారులు ప్రకటించారు. మొదటి రోజున 6795 మంది విద్యార్థులు, 235 మంది ఉపాధ్యాయులు, రెండోరోజు 16,795 మంది విద్యార్థులు, 240 ఉపాధ్యాయులు, మూడోరోజు 12,574 మంది విద్యార్థులు, 230 మంది విద్యార్థులు సందర్శించినట్లు ప్రకటించారు.

జాతీయస్థాయికి వరుణ్ చక్రవర్తి ఎంపిక..

జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు నలుగురు విద్యార్థులను ఎంపిక చేయగా అందులో మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం చిన్నరేవల్లి ఎంపీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థి వరుణ్ చక్రవర్తి ఉన్నారు. గణిత విభాగంలో మ్యాథ్స్ బేసిక్ కాన్సెప్ట్ బోర్డును తయారు చేశారు. గైడ్ ఉపాధ్యాయుడు అశోక్ సాయంతో ప్రదర్శనకు హాజరయ్యారు. మిగిలిన ముగ్గురిలో మెదక్ జిల్లాకు చెందిన హ్యూమన్ (బయోప్లాస్టిక్), జగిత్యాల జిల్లాకు చెందిన సీహెచ్ మణిదీప్ (బార్డర్ అలారం), భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రణీత్ (మల్టీపర్పస్ అగ్రికల్చర్) ఉన్నారు.



జాతీయస్థాయికి ఎంపికైన చిన్నరేవల్లి విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

సదరన్ సౌత్‌ఫెస్ట్‌కు 4 ప్రదర్శనలు..

ఈ నెల 20 నుంచి పుదుచ్చేరిలో జరిగే సదరన్ సౌత్‌ఫెస్ట్–2025కు ఉమ్మడి జిల్లా నుంచి నాలుగు ప్రదర్శనలు ఎంపికయ్యాయి. వాటిలో మహబూబ్‌నగర్ జిల్లా చిన్నరేవల్లి ఎంపీహెచ్‌ఎస్ విద్యార్థి వరుణ్ చక్రవర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా బల్లాన్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.రిషిత, నాగర్‌కర్నూల్ గీతాంజలి ఉన్నత పాఠశాల విద్యార్థి కె.విజ్ఞశ్రీ, నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి గగన్‌చంద్ర ఉన్నారు.



జాతీయస్థాయికి ఎంపికైన కొత్తకోట విద్యార్థి మణికంఠ

ఇన్‌స్పైర్‌లో 3 ప్రదర్శనలు..

ఇన్‌స్పైర్ విభాగంలో ఉమ్మడి జిల్లా నుంచి 3 ప్రదర్శనలు జాతీయస్థాయికి ఎంపికైన ఎంపిక కావడం విశేషం. వాటిలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల శ్లోక బిర్లా పాఠశాల విద్యార్థి వావిలాల హర్షవర్ధన్ ప్రదర్శించిన లోకాస్ట్ అండ్ రియూజబుల్ మిక్చర్ కన్వర్ట్ ఇన్‌టు పౌట్టేరి మిషన్, వనపర్తి జిల్లా కొత్తకోట నివేదిత ఉన్నత పాఠశాల విద్యార్థి జి.మణికంఠ ప్రదర్శించిన కంట్రోలింగ్ మొబైల్ చార్జర్ బై యూజింగ్ టైమర్, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి సంజయ్‌కృష్ణ ప్రదర్శన స్పెషల్లీ డిజబుల్ పర్సన్స్ యూజింగ్ అండర్ ఆమ్ క్రచెస్‌కు చోటు దక్కింది.

ప్రతి పనిలో సైన్స్ దాగి ఉంది

- విద్యార్థుల ప్రతిభ అంతర్జాతీయ స్థాయికి చేరేలా ఉపాధ్యాయులు కృషిచేయాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల టౌన్: నిజ జీవితంలో ప్రతి పనిలోనూ సైన్స్ దాగి ఉందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. సైన్స్‌తోనే మన జీవితంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని.. వినియోగించే పరికరాలు సైన్స్ ఆధారంగా రూపొందించినవేనని తెలిపారు. విద్యార్థులు సైన్స్‌ను కెరీర్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని.. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. వైజ్ఞానిక ప్రదర్శనలు తీసుకొచ్చిన విద్యార్థులందరూ విజేతలనేని స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రదర్శనలు గొప్పగా ఉన్నాయని.. అందుకు కారణమైన గైడ్ ఉపాధ్యాయులను అభినందించారు. మున్ముందు విద్యార్థుల ప్రదర్శనలను మరింత తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీపై ఉందని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు సహకరించిన అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు, మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ సిబ్బందితో పాటు ఎస్‌వీకేఎం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ప్రదర్శనలు అమోఘం..

విద్యార్థుల ప్రదర్శనలు అమోఘంగా ఉన్నాయని.. హాజరైన విద్యార్థులందరూ భావి శాస్త్రవేత్తలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. బాగా చదువుకుంటే ఉన్నతాధికారులు కావచ్చని.. మాలా రాజకీయ నాయకులు కావొద్దని కోరారు. రాజకీయ నాయకులకు పిల్లను ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని నవ్వులు పూయించారు. కలెక్టర్, ఎస్పీలు మహిళలేనని.. వారిని ఆదర్శంగా తీసుకొని ఆడ పిల్లలను చదివించాలని సూచించారు. ప్రతి పదేళ్లకోమారు జనరేషన్ మారుతుందని, ఆలోచనలు సైతం మారుతాయన్నారు. ఎస్‌ఈఆర్టీ డైరెక్టర్ రమేశ్ మాట్లాడుతూ.. ఇన్‌స్పైరి, ఆర్‌ఎస్‌బీవీపీ వైజ్ఞానిక ప్రదర్శనలు రెండు ఒకేచోట నిర్వహించుకోవడం ఇదే ప్రథమమన్నారు. రెండింటిని విజయవంతంగా నిర్వహించుకోవడం అభినందనీయమని కొనియాడారు. ముగింపు సభలో ఎస్పీ జానకి, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈఓ ప్రవీణ్‌కుమార్, సీఎంఓ బాలూయాదవ్, ఏఎంఓ శ్రీనివాస్, డీఎస్‌ఓ శ్రీనివాసులు, ఎంఈఓ మంజులాదేవి, ఎస్‌వీకేఎం ప్రిన్సిపాల్ ఎబినేజర్ పాల్గొన్నారు.



ముగింపు సభకు హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

సదరన్ సౌత్‌ఫెస్ట్‌కు ఎంపికైన వారు..

ఆహారం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం సీనియర్ విభాగంలో అంజనశ్రీ (మెదక్), మౌనిక (ఆదిలాబాద్), అంకిత (నిజామాబాద్).. జూనియర్ విభాగంలో పి.శ్రీమేధ (వరంగల్), హర్షవర్ధన్ (యాదాద్రి).

- ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ సీనియర్ విభాగంలో టి.సత్యసాయి వివేకానంద్ (ఖమ్మం), గగన్‌చంద్ర (నాగర్‌కర్నూల్), సాయిశోభిత (మంచిర్యాల).. జూనియర్ విభాగంలో మణిదీప్ (జగిత్యాల), అలోక్‌చంద్ర (వరంగల్).
- సహజ వ్యవసాయం సీనియర్ విభాగంలో హర్షిత (జగిత్యాల), లక్ష్మీప్రసన్న (ములుగు), మన్విత‌ారెడ్డి (హన్మకొండ).. జూనియర్ విభాగంలో ప్రణీత్ (భద్రాద్రి కొత్తగూడెం), ఐశ్వర్య (ఖమ్మం).
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సీనియర్ విభాగంలో అంకిత్‌కుమార్ (సంగారెడ్డి), సంతోష్‌కుమార్ (భద్రాద్రి కొత్తగూడెం), శివచైతన్య (మెదక్).. జూనియర్ విభాగంలో శ్రీకరణ్‌రెడ్డి (మహబూబాబాద్), స్నిగ్ధా (జనగాం).
- వేస్ట్ మేనేజ్‌మెంట్ సీనియర్ విభాగంలో విజిదేంద్రియ (నిజామాబాద్), విజ్ఞశ్రీ (నాగర్‌కర్నూల్), చందు (జనగాం).. జూనియర్ విభాగంలో ఉపశ్రీ (ఖమ్మం), వర్షిత (జనగాం).
- రీసోర్స్ మేనేజ్‌మెంట్ సీనియర్ విభాగంలో ఎండీ అబ్దుల్ (హైదరాబాద్), ఎస్.ధ్రువేష్ (మేడ్చల్), అర్జున్ (వరంగల్).. జూనియర్ విభాగంలో హ్యూమన్ (మెదక్), రిషిత (నాగర్‌కర్నూల్).
- మ్యాథమెటిక్స్ సీనియర్స్‌లో మహిమ (ఖమ్మం), నవదీప్ (నిజామాబాద్), ఆర్సాయుక్ర (కరీంనగర్).. జూనియర్స్‌లో వరుణ్‌చక్రవర్తి (మహబూబ్‌నగర్), ఆసియా ఫాతిమా (మెదక్).

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మహిళ మృతి

గట్టు: మండలంలోని మాచర్ల గ్రామానికి చెందిన బోయ శాంతమ్మ (60) చీరకు ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా.. కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కృష్ణుడు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మాచర్లలో డిసెంబర్ 20న గ్రామ దేవతల ఊరేగింపులో చీరకు దీపం తగిలి నిప్పంటుకుంది. వెంటనే గద్వాల ఆస్పత్రికి అటు నుంచి కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. కుమారుడు చిన్నరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

షాపుకొచ్చాడు.. కిరోసిన్ పోసి తగులబెట్టాడు

మహబూబ్‌నగర్ క్రైం: అర్ధరాత్రి సమయంలో కిరాణం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి కిరోసిన్ పోసి నిప్పు పెట్టడంతో షాప్ దగ్ధమైంది. వన్‌టౌన్ ఎస్ఐ శీనయ్య కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని హబీబ్‌నగర్‌కు చెందిన సమ్మద్ ఇంట్లోనే కిరాణ దుకాణం నడుపుతున్నాడు. బుధవారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వ్యక్తి కిరోసిన్ డబ్బాతో దుకాణం దగ్గరకు చేరుకొని షాపులో చల్లి నిప్పు అంటించడంతో పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.70 వేల వరకు నష్టం సంభవించిందని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పెద్దకొత్తపల్లి ఫొటోగ్రాఫర్‌కు గోల్డ్‌మెడల్





లింగం

పెద్దకొత్తపల్లి: ఒరిస్సా రాష్ట్రంలో జాతీయస్థాయి ఫొటో గ్రాఫర్లకు ఈ నెల 5,6లో 7వ జాతీయ స్థాయి వర్క్‌షాప్ హుస్సేన్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో 100 మంది ఫొటోగ్రాఫర్లు వివిధ రాష్ట్రాల నుంచి హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన ఎస్‌ఎల్ ఫొటో స్టూడియో నిర్వాహకుడు లింగం జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాడు. బోండ గిరిజన మహిళల వేషధారణ ఫొటోలు తీసి ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాడు. హుస్సేన్‌ఖాన్ ఫొటోగ్రాఫీ ఆధ్వర్యంలో ఎస్‌పీ రమేష్, రవి, రామకృష్ణల చేతుల మీదుగా గోల్డ్ మెడల్‌ను అందుకున్నాడు. ఈ సందర్భంగా లింగంను ఫొటోగ్రాఫర్లు శ్రీమిత్ర రాజు, మద్దిలేటి నరసింహ, శంకర్, శీను, మల్లేష్‌లు అభినందించారు.

నేటి నుంచి హ్యాండ్‌బాల్ సంగ్రామం



జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు సిద్ధమైన మెయిన్ స్టేడియం

- పాలమూరు వేదికగా అండర్–17 జాతీయస్థాయి టోర్నీ
- ఐదు రోజుల పాటు మెగా టోర్నీ నిర్వహణ
- హాజరుకానున్న 36రాష్ట్రాలు, కేంద్రపాలిత జట్లు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు జిల్లాకు భారీ క్రీడలు నిర్వహించడంలో రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. 2019 కరోనా తర్వాత ఈ ఏడాది రెండో ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి టోర్నీ నిర్వహించనున్నారు. గత నెలలో కోస్గిలో అండర్–19 ఎస్‌జీఫ్ బాలుర జాతీయస్థాయి వాలీబాల్ టోర్నీని విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు పాలమూరు హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు ఆతిథ్యం ఇస్తుంది. నేటి (శుక్రవారం) నుంచి ఈనెల 14 వరకు ఎస్‌జీఎఫ్ఐ అండర్–17 నేషనల్ హ్యాండ్‌బాల్ బాల, బాలికల చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు.

క్రీడాకారులు, అఫీషియల్స్ వివరాలు

నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీలో బాలుర 35, బాలికలు 36 రాష్ట్రాల నుంచి 1550 మంది క్రీడాకారులు హాజరవుతుండగా 200 మంది అఫీషియల్స్ పాల్గొంటున్నారు.

– బాలుర విభాగంలో అస్సాం, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, బీహార్, చండీఘర్, చత్తీస్‌ఘర్, సీబీఎస్‌ఈ వెల్ఫేర్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్, కౌన్సిల్ ఫర్ ద ఇండియన్ స్కూల్, ఢిల్లీ, డీఏవీ, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, ఐపీఎస్‌సీ, జార్ఖండ్, జమ్ముకశ్మీర్, కర్నాటక, కేరళ, కేంద్రీయ విద్యాలయం సంఘటన, లద్దాఖ్, మధ్యప్రదేశ్, మణిపూర్, నవోదయ విద్యాసమితి, పుదుచ్చేరి, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, త్రిపుర, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, విద్యాభారతి, వెస్ట్ బెంగాల్, సీబీఎస్‌ఈ జట్లు.

– బాలికల విభాగంలో అస్సాం, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, బీహార్, చండీఘర్, చత్తీస్‌ఘర్, కౌన్సిల్ ఫర్ ద ఇండియన్ స్కూల్, ఢిల్లీ, డీఏవీ, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, ఐపీఎస్‌సీ, ఇంటర్నేషనల్ బోర్డు స్కూల్స్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్, జార్ఖండ్, జమ్ముకాశ్మీర్, కర్నాటక, కేరళ, కేంద్రీయ విద్యాలయ సంఘటన, లద్దాఖ్, మధ్యప్రదేశ్, మణిపూర్, నవోదయ విద్యా సమితి, పుదుచ్చేరి, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, త్రిపుర, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, విద్యాభారతి, వెస్ట్ బెంగాల్, సీబీఎస్‌ఈ జట్లు పాల్గొంటున్నాయి. జాతీయ క్రీడల నిర్వహణ కోసం 8 కమిటీలను ఏర్పాటు చేశారు. పాలమూరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయా రాష్ట్రాల జట్లకు పలువురు పీడీలు స్వాగతం పలుకుతున్నారు. స్టేషన్ నుంచి వారికి బసచేసే స్థలాల్లో క్రీడాకారులను తరలిస్తున్నారు.

గురుకులాల్లో వసతి

ఆయా రాష్ట్రాల బాలికలకు జిల్లా కేంద్రం భగీరథ కాలనీలోని మైనార్టీ బాలికల గురుకుల 1, 2, 3 పాఠశాలల్లో, బాలురకు బీకేరెడ్డికాలనీలోని బాలుర మైనార్టీ గురుకులాల్లో వసతి ఏర్పాటుచేశారు. క్రీడాకారులందరికీ బీపీహెచ్‌ఎస్‌లో భోజన సౌకర్యం ఏర్పాటుచేశారు. కొన్ని రాష్ట్రాల క్రీడాకారులు తాము బసచేసే చోటనే సొంతంగా వంట చేసుకోనున్నారు.

నేడు అట్టహాసంగా ప్రారంభం

నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీ నేడు (శుక్రవారం) ఉదయం 11గంటలకు మెయిన్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ క్రీడల వ్యవహారాల సలహాదారులు ఏపీ.జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్ రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితరులు హాజరుకానున్నారు.

నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ బాల, బాలికల జట్లు

జాతీయస్థాయి అండర్–17 హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ బాల, బాలికల జట్లు పాల్గొంటున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన బాలుర జట్టులో ఐదుగురు, బాలికల జట్టులో ముగ్గురు క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు.

తెలంగాణ బాలుర జట్టు

వి.సాత్విక్, మహ్మద్ సభిబుద్దీన్, కుషాల్‌గౌడ్, బి.చైతన్య కృష్ణారెడ్డి, మద్ది వంశీ, మామిడి సంజీవ్, రాగం ఈశ్వర్, జి.విష్ణువర్ధన్, మాలోతు చంటి, పి.అవినాష్ నాయక్, ఎన్.అభిషేక్, ఎల్కిచర్ల గణేష, ఆర్.శ్రీకృష్ణచైతన్య, పి.హేమచంద్ర, టి.శ్రీహర్ష, కరం ప్రదీప్, స్టాండ్‌బైలుగా ఆర్.శిరీష్ వర్షన్, బోయిని చైతన్య, కె.హర్షవర్ధన్.

రాష్ట్ర బాలికల జట్టు...

ఎం.కవిత, దురువ నందిని, జె.సాయి సీతుశ్రీ, జె.యేగిశ్వరి, కోదూరి అక్షయ, జి.సుదీక్ష, కె.సాయి లక్ష్మీప్రియ, బెస్త పారిజాత, ఇఫ్రా అఫ్షిన్, వి.వైష్ణవి, సిరంగి శిరీష, భాగరి చైత్ర, పి.వామిక క్రిష్ణ, పి.ప్రీతి, ఎం.అలేఖ్య, పీఎస్ అంజలి, స్టాండ్‌బైలుగా కె.నవనీత, టి.సత్యభామ, డి.తనుశ్రీ.

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు

నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీ కోసం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియాన్ని సిద్ధం చేశారు. లీగ్‌కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. మూడు కోర్టుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కూడా మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.



తెలంగాణ బాల బాలికల జట్లతో ప్రతినిధులు



మెయిన్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రతినిధులు

ఏర్పాట్లను పరిశీలించిన నిర్వాహక ప్రతినిధులు

జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో గురువారం జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17 హ్యాండ్‌బాల్ పోటీల ఏర్పాట్లను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి పరిశీలించారు. టోర్నీ నిర్వహణ కోసం అన్నివిధాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అండర్–19 జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి, రజనికాంత్‌రెడ్డి, జియావుద్దీన్, బాల్‌రాజు, ఆర్.బాల్‌రాజు, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

చెంచుల తావు నుంచి తరమొద్దు

ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

మన్ననూర్: 'అడవి, చెంచులు వేర్వేరు కాదు.. తల్లిలాంటి చెంచుల ఆవాసమైన నల్లమల నుంచి గిరిజనులను వేరు చేయవద్దని ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. వేల సంవత్సరాలుగా అడవినే నమ్ముకొని జీవిస్తున్న చెంచులు అడవిని కాపాడుతున్నారే తప్ప ఎన్నడూ నాశనం చేసిన దాఖలాలు లేవని, చెంచుల తావు నుంచి వారిని తరమొద్దన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం కొమ్మెన్‌పెంట చెంచులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 12వ శతాబ్దంలో జరిగిన పలనాటి యుద్ధం నేపథ్యంలో చెంచు గిరిజనుల జీవిత పార్శ్వాన్ని ఆధారంగా చేసుకొని రాస్తున్న 'కారుకోడి' నవలకు కావాల్సిన ఆధారాలను సేకరించడంలో భాగంగా సీనియర్ జర్నలిస్టులు రఘురాములు, మారుతిసాగర్‌తో కలిసి కొల్లం, కొమ్మెన్‌పెంట, చిగుర్లపాడు, రాళ్లరేవు, బంగారి మడుగు పరిసర ప్రాంతాల్లో చెంచులతో కలిసి మూడు రోజుల పాటు కలియ తిరిగి చెంచుల భాష, సంస్కృతి సంప్రదాయాలు, సాహిత్యపు ఆనవాళ్లను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ ప్రపంచం మొత్తం స్వార్థం, ఈర్ష, అనుమానాలతో బతుకుతున్న ఈ కాలంలో పరిమితంగా, ప్రశాంత జీవనం సాగిస్తున్న చెంచులు గ్రామాలు, పట్టణవాసులకు జీవన పాఠాలు నేర్పుతున్నారన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే చెంచుల స్థితిగతుల మార్పు కోసం కొమ్మెన్ పెంటలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణను స్వయంగా కలిసి కోరుతానన్నారు. అనంతరం కొమ్మెన్ పెంటలోని చెంచులకు దుప్పట్లు, బియ్యం, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాస్కర్, చందునాయక్, ఇన్నయ్య సాగర్, రంజిత్, రమేష్, మహేష్, ఆంజనేయులు, సాగర్, మధు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



చెంచులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

శ్రీశైలంలో నీటిమట్టం తగ్గుముఖం

ప్రస్తుతం 103.89 టీఎంసీల నీరు

దోమలపెంట : శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. జనవరి నెల పూర్తి కాకముందే వంద టీఎంసీలు నీటి నిల్వకు చేరుకుంది. నీటి సంవత్సరం ప్రారంభానికి ఇంకా అయిదు నెలల సమయం ఉంది. అంత వరకు సాగు, తాగునీటికి జలాశయంలో నీటి వనరుల అవసరం ఉంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885.0 అడుగుల వద్ద 215.8070 టీఎంసీలు కాగా.. గురువారం జలాశయంలో నీటిమట్టం 859.3 అడుగుల వద్ద 103.8942 టీఎంసీల నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో డ్రాఫ్ట్ ట్యూబ్ వద్ద నీటి ఊట వలన పంప్‌మోడ్ నిలిపి వేయడంతో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి నీటి (ఎత్తిపోతల) తరలింపు నిలిచిపోయింది. ప్రస్తుతం జలాశయంలో నీటి వనరులను పొదుపుగా వాడు కుంటేనే ఎండాకాలంలో సాగు, తాగుకు నీటి వనరులు అందుబాటులో ఉంటాయి. గురువారం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 35,315 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,716, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, మల్యాల ఎత్తిపోతల నుంచి కేసీ కెనాల్‌కు 338, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 2.852 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

రామన్‌పాడులో 1,019 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడులో గురువారం నాటికి నీటి మట్టం 1,019 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ 550 నుంచి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 65 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కులు వివిధ లిఫ్టుల ద్వారా 873 క్యూసెక్కులు వదులుతున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

BUSINESS SERVICES

- మీ బంగారం బ్యాంక్‌లో, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 [SCA25001126]

BUSINESS OFFER

- కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్‌ల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్ ✆ 9671637906. [T-297]
- మహబూబ్‌నగర్ ఎర్రసత్యం చౌరస్తా అమ్మ ఎంటర్ ప్రైజెస్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ బిజినెస్ అవకాశం కలదు. ఆగర్ బత్తి, కర్పూరం, పేపర్ ప్లేట్ మిషన్స్‌తో ఇంట్లో ఉండి పనిచేసుకొని ఉపాధి పొందవచ్చు. సెల్ : 8374003801. [SCA25001112]

WANTED

- జడ్చర్ల నక్షత్ర హోటల్‌లో పనిచేయుటకు అనుభవం గల బిల్లింగ్ మరియు ఫ్లోర్ మేనేజర్ వ్యక్తులు కావలెను. ఆసక్తి కలవారు ఇంటర్వ్యూకు 12వ తేదీ సాయంత్రం 4:00 గంటలకు హాజరు కాగలరు. స్థలం:నక్షత్ర హోటల్ కల్వకుర్తి రోడ్ జడ్చర్ల. [J-862]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్